క్లుప్తంగా

'సబ్బుల పరిశ్రమ తొలగించాలి'

భైంసాటౌన్: మాటేగాం శివారులోని సబ్బుల పరిశ్రమను తొలగించాలని గ్రామస్తులు పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంతోపాటు, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామశివారులోని సబ్బుల పరిశ్రమ నుంచి వచ్చే రసాయనాలు, వ్యర్థాలు పంట కాల్వల పక్కనుంచి వెళ్తుండడంతో పంటలు సరిగా పండడం లేదని, అంతేగాక, తమకు చర్మ సంబంధ వ్యాధులు తలెత్తుతున్నాయన్నారు. దుర్గంధం వస్తుండడంతో చేలల్లో పని చేసేందుకు కూలీలు కూడా రావడం లేదన్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పరిశ్రమను గ్రామం నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాగభూషణ్, పోతన్న, వెంకటేశ్, మాధవ్, అంజన్న, మహేశ్, తదితరులున్నారు.

'బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి'

భైంసాటౌన్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇష్టారీతిన నిర్వహిస్తున్న బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు బి సుదీప్ కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన యువత, పెద్దలు మద్యానికి బానిసగా మారి కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సంబంధిత అధికారులు మాత్రం మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అలాగే మాటేగాం టోల్‌ప్లాజా వద్ద ఓవైపు రేకులు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఘనంగా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాల ఊరేగింపులో మహిళలు

కుంటాల: మండలంలోని శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకుని సోమవారం బాజాభజంత్రీలు, మంగళహారతులతో ఘనంగా గ్రామస్తులు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. పండితుడు భగవాను జోషి ఆధ్వర్యంలో దేవతామూర్తుల ఊరేగింపు, అగ్ని ప్రతిష్ట, గణపతి, నవగ్రహ హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఖానాపూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందం అన్నారు. పొగాకు, మత్తు పదార్థాలతో దుష్ప్రభావాలపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. పొగాకురహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. పొగాకుతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోశ్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

పేదలపై కేసులు ఎత్తివేయాలి

ఖానాపూర్: గత ప్రభుత్వంలో అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లు కేటాయించారని సర్వడే గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ములంకల మురళి, ప్రధాన కార్యదర్శి షేర్ భూమేశ్ అన్నారు. పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో సోమవారం వారు పర్యటించారు. అనర్హులను తొలగించాలని నిరసన చేపట్టిన ఇళ్లు లేని పేదలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే సమగ్ర సర్వే చేయించి పేదలకు ఇళ్లు కేటాయించాలని లేకపోతే హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు.

అనారోగ్యంతో వీవోఏ మృతి



శంకర్ (ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా (బి) గ్రామానికి చెందిన వీవోఏ లింగురాం శంకర్ (48) సోమవారం వేకువజాము భైంసాలో చికిత్సపొందుతూ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఏపీఎం అశోక్, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు అంత్యక్రియలో పాల్గొని నివాళిర్పించారు.

ప్రజావాణిలో కాలక్షేపం



కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఆలస్యంగా రావడంతో అదనపు కలెక్టర్ ఫైజాన్ హైమద్ అర్జీలు స్వీకరించారు. జిల్లా అధికారులు మాత్రం కాలక్షేపం చేస్తూ కనిపించారు. కొందరు సెల్‌ఫోన్‌లో నిమగ్నమయ్యారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

మహారాష్ట్రపైనే ఆశలు..!

- గడ్డెన్నవాగుకు చేరని వరదనీరు
- రేనాపూర్ రిజర్వాయర్ నిండితేనే దిగువకు నీరు
- ఈ సీజన్‌లో అక్కడా వర్షాలు అంతంతే



భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు(ఫైల్)

ప్రాజెక్ట్ సామర్థ్యం:	పూర్తిస్థాయి నీటిమట్టం:	ప్రస్తుత నీటిమట్టం:	మొత్తం గేట్లు:	ఆయకట్టు:
1.83 టీఎంసీలు	358.70 మీ.	356.90 మీ.	08	13,950 ఎకరాలు

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వరద నీరు చేరడం లేదు. ఎగువన సరైన వర్షాలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో రాలేదు. వర్షాకాలం సీజన్‌లో ఇప్పటివరకు చుక్క నీరు కూడా చేరలేదు. రెండురోజులుగా కురిసిన వర్షాలకు దాదాపు 10వేల క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. గతేడాది ఇదే పరిస్థితి నెలకొంది. జూలై నెలాఖరు వరకు ప్రాజెక్టులోకి ఆశించిన స్థాయిలో వరదనీరు చేరలేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ఆదివారం 4051 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 356.90 మీటర్ల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు ఎనిమిది గేట్లు ఉండగా, 2023 జూలై రెండోవారంలోనే లక్షల క్యూసెక్కుల నీరు రాగా, అధికారులు ఏడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం ఐదారురోజులుగా వర్షం కురుస్తున్నా ప్రాజెక్టు మాత్రం నిండడం లేదు. స్వల్పంగానే ఇన్‌ఫ్లో వస్తుండడంతో 0.918 టీఎంల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు ఆయకట్టు కింద భైంసా, లోకేశ్వరం మండలాల్లో 14 వేల ఎకరాలకు ప్రాజెక్టు నీరే ఆధారం.

రేనాపూర్ నిండితేనే..

గడ్డెన్నవాగు ప్రాజెక్టు కుభీర్ రోడ్డులో మిర్జాపూర్ సమీపంలో నిర్మించారు. ప్రాజెక్టుకు ఎగువన కుభీర్ మండలంలోని నిగ్వాతోపాటు మహారాష్ట్రలోని భోకర్ తాలూకా పరిధిలోని మాతుల్, పిప్పల్‌గాం, దివిసి, రేనాపూర్ ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతాల్లో సరైన వర్షాలు కురిస్తేనే గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వర్షపు నీరు వచ్చి చేరుతుంది. ముఖ్యంగా రేనాపూర్ గ్రామంలోని రిజర్వాయర్ నిండితే, దిగువన దివిసి చెక్‌డ్యాం, అటుపై మాతుల్, పిప్పల్‌గాం వాగుల ద్వారా నిగ్వా మీదుగా గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరదనీరు చేరుతుంది. అయితే, రేనాపూర్ రిజర్వాయర్ ఎత్తు పెంచడం, దివిసి వద్ద చెక్‌డ్యాం నిర్మించడంతో గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వరదనీరు చేరడంలో జాప్యం ఏర్పడుతోంది. ఆ ప్రాంతాల్లో అధిక వర్షం కురిస్తేనే రేనాపూర్ రిజర్వాయర్ నిండి దిగువన వాగుల ద్వారా గడ్డెన్నవాగుకు ఇన్‌ఫ్లో చేరుతుంది. ఈ సీజన్‌లో అక్కడ సరైన వర్షాలు లేకపోవడంతో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు నీరు చేరలేదు.

ఎగువన వర్షాలు కురిస్తేనే..

గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద భైంసా మండలంతోపాటు లోకేశ్వరం మండలంలోని దాదాపు 14 వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంటుంది. అంతేగాక, మిర్జాపూర్ శివారులో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టు నుంచి ప్రతీరోజు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తారు. ఈనేపథ్యంలో ఎగువన మహారాష్ట్రలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వరద నీరు చేరుతుంది. తద్వారా ప్రాజెక్టు నిండి సాగు, తాగునీటి అవసరాలకు ఢోకా ఉండదని రైతులు, అధికారులు భావిస్తున్నారు.

గడువు ముగిసిన ఎరువులు విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



అధికారులతో మాట్లాడుతున్న అభిలాష అభినవ్

సారంగాపూర్: రైతులకు గడువు ముగిసిన ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే దుకాణాన్ని సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు మోసం చేసేలా డీలర్ వ్యవహరిస్తే చర్యలు తీసుకోవడంతోపాటు లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ఏవో వికార్ అహ్మద్, నాయకులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సోమవారం బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేశారు. ముధోల్ మండలం బ్రహ్మణ్‌గాం గ్రామానికి చెందిన మ్యాతరి సాయన్న అనారోగ్యంతో కొన్నిరోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే..రూ.75 వేల ఎల్‌ఓసీ మంజూరు చేయించి బాధిత కుటుంబీకులకు అందించారు. రాంరెడ్డి, పోతారెడ్డి, రాజు, గంగారెడ్డి, అనిల్ ఉన్నారు.

మేడిపెల్లికి బస్సు నడపండి



ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి గ్రామానికి బస్సు నడపాలని కోరుతూ భాగ్యనగర్, కొత్త పోచంపాడు గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ వాహనాల సాకుతో ఆర్టీసీ అధికారులు గతంలో బస్సును రద్దుచేశారని వాపోయారు. జిల్లా కేంద్రం నుంచి మండలంలోని భాగ్యనగర్, కొత్త పోచంపాడు గ్రామాల మీదుగా మేడిపల్లికి బస్సు నడిపితే సౌకర్యంగా ఉంటుందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే..ఆర్టీసీ డీఎంతో మాట్లాడి బస్సు వెంటనే నడపాలని ఆదేశించారు.

ముస్తాబైన ఆలయం

- నేడు నాగుల పంచమి



సుంక్లి గ్రామంలోని నాగదేవత ఆలయం

భైంసారూరల్: నేడు జరిగే నాగుల పంచమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని ఆలయాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం నుంచి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుట్టల వద్దకు వెళ్లి పాలు పోస్తారు. అనంతరం ఇంట్లో దేవతామూర్తులు, నాగదేవత చిత్రపటాలను ఉంచి పూజలు చేస్తారు. అనంతరం తోబుట్టువులకు పాలతో కళ్లను కడిగి క్షేమంగా ఉండాలని ఆడపడచులు ఆశీర్వదిస్తారు.

వివాహిత అదృశ్యం

భైంసాటౌన్: కుభీర్ మండలం కుప్టి గ్రామానికి చెందిన ఓ వివాహిత (30) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన వివాహిత తన తల్లిగారి గ్రామమైన సిర్పెల్లి నుంచి తన ముగ్గురు అక్కలతో కలిసి ఆదివారం భైంసాకు వచ్చింది. అనంతరం కుప్టికి వెళ్లేందుకు ఆటోలో ఎక్కించగా, ఆమె గ్రామానికి చేరుకోలేదు. దీంతో భర్త సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఆలయాలకు శ్రావణ శోభ



బుధవార్‌పేట్ శివాలయంలో శివలింగం



నగరేశ్వర్ వాడలో శివలింగానికి పూజ చేస్తూ..

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌టౌన్/భైంసారూరల్/నర్సాపూర్(జి)/కుంటాల/దిలావర్‌పూర్/తానూరు (ముధోల్): ఆలయాల్లో శ్రావణ శోభ సంతరించుకున్నాయి. శ్రావణమాసం తొలి సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి శివలింగాలు, దేవతామూర్తులకు పూజలు నిర్వహించారు. శివలింగాలకు ప్రత్యేక అర్చనలు, బిల్వపత్రాలు, క్షీరాభిషేకం, గంగాజలం సమర్పించారు. ఉపవాసాలు ఉండి శివనామస్మరణ చేశారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



కుంటాల: శ్రీఉమామహేశ్వర ఆలయంలో

భైంసా మండలం సిరాలలోని జోడు శివాలయంలో



దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే రామారావు పటేల్



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: దశలవారీగా నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. స్థానిక రైతు వేదికలో సోమవారం ఉమ్మడి కుంటాల మండల లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 11,300 లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూస్తానన్నారు. ఐదేళ్లలో 17వేల ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా కుంటాల శివారులోని సబ్ మార్కెట్ గోదాం వద్ద మొక్కలు నాటారు. అనంతరం దౌనెల్లిలో దేవాదాయ శాఖ నిధులు రూ.30 లక్షలతో శివాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవో వనజ, తహసీల్దార్లు కమల్‌సింగ్, శ్రీకాంత్, జెడ్పీ మాజీ చైర్మన్ అశోక్, సింగిల్ విండో చైర్మన్ గజ్జారాం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, గజ్జారాం, రమణారావు, వెంగల్‌రావు, లక్ష్మణ్, మహేందర్, బీజేపీ మండల కన్వీనర్ నవీన్, హైమద్,గౌస్, ఆలయ కమిటీ చైర్మన్ సుదర్శన్, జేఈ శ్యాం సుందర్ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

కుంటాల రైతువేదికలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రేషన్ కార్డులు పంపిణీకి ఎమ్మెల్యే రామారావు పటేల్ వచ్చారు. లబ్ధిదారులకు కేంద్రప్రభుత్వం 5 కిలోల బియ్యం ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం కిలో బియ్యం మాత్రమే ఇస్తుందని బీజేపీ నేతలు ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు కల్పించుకుని గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, సీఎం రేవంత్ రెడ్డి పేదలకు రేషన్ కార్డులు ఇస్తున్నారని చెప్పడంతో ఇరువర్గాల నాయకులు వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే కల్పించుకుని ఏ పార్టీలో ఉన్న అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామని వారికి సర్దిచెప్పారు.

రేషన్‌కార్డుల జారీ నిరుపేదలకు వరం

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



రేషన్‌కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగపూర్: రేషన్‌కార్డుల జారీ నిరుపేద ప్రజలకు వరంలాంటిదని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి సోమవారం రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 1,425 కొత్త రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2 వేల కుటుంబాలకు 10,325 కార్డులు జారీ చేశామని తెలిపారు. రేషన్‌కార్డుల జారీ నిరంతరం కొనసాగే ప్రక్రియ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, జిల్లా వ్యవసాయధికారి అంజిప్రసాద్, ఏవో వికార్‌అహ్మద్ ఉన్నారు.

నర్సాపూర్(జి): స్థానిక రైతువేదికలో మండలానికి చెందిన 877 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆర్డీవో రత్నకళ్యాణి పాల్గొన్నారు.

లోలెవల్ వంతెన పరిశీలన



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

తానూరు: మండలంలోని ఝరి(బి) సమీపంలోని లోలెవల్ వంతెనను ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సోమవారం పరిశీలించారు. చిన్నపాటి వర్షాలు కురిసిన వరద నీరు వంతెనపై నుంచి ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. భారీ వర్షాలు కురిస్తే తెలంగాణతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు రవాణా వ్యవస్థ నిలిచిపోతుందని తెలిపారు. గ్రామానికి బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ఆలయంలో పూజలు

శ్రావణసోమవారం సందర్భంగా మండలంలోని బోరిగాం మహాదేవున్ని ఆలయంలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని హామీఇచ్చారు. చిన్నారెడ్డి, శివాజీపటేల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

తానూరు(ముధోల్): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆగస్టు 15లోపు పరిష్కరించాలని లేకపోతే పోరాటం చేస్తామని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు తెలిపారు. ముధోల్ మండలంలోని మచ్కల్–రాంటెక్–ముథోల్‌లోని బాలుర బాలికల, గురుకుల పాఠశాలలో సోమవారం యూనియన్ సభ్యత్వాన్ని నమోదు నిర్వహించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గంగాధర్, శ్రీనివాసరావు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సోన్: కడ్తాల్, మాదాపూర్, పాక్‌పట్ల పాఠశాలల్లో సోమవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, కార్యదర్శి నగేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విద్యాసాగర్‌రావు, చంద్రశేఖర్‌రావు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమవుతాయని మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు అన్నారు. మాయాపూర్, బన్సపల్లి,కాల్వ తదిత గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సంఘ సభ్యత్వం అందజేశారు. నరేశ్‌కుమార్, విశ్వనాథ్, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామానికి చెందిన నాయకుడు నర్సింగ్‌రావు పాఠశాల అభివృద్ధికి రూ.5వేల విరాళాన్ని హెచ్‌ఎం సామ దేవేందర్‌రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ నగదుతో పూల, పండ్ల మొక్కలను కొనుగోలు చేసి పాఠశాల అవరణలో నాటారు. అనంతరం నర్సింగ్‌రావును సిబ్బంది సన్మానించారు. ఉపాధ్యాయుడు ధనుంజయ్, గ్రామస్తులు ఉన్నారు.

పేద కుటుంబానికి చేయూత

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాలకు చెందిన కొడమంచి గంగామణికి వరల్డ్ విజన్ సంస్థ అండగా నిలిచింది. స్టీల్, ప్లాస్టిక్ వస్తువులను అమ్ముతూ వచ్చిన చాలీచాలని డబ్బులతో ఆమె కుటుంబాన్ని పోషించుకుంటుంది. విషయం తెలుసుకున్న స్వచ్ఛందసంస్థ ఆమెకు రూ.25 వేల విలువైన ఫాన్సీ, స్టీల్ సామన్లు ఎంపీడీవో రాథోడ్ రాధతో సోమవారం అందజేశారు.

పరామర్శ

భైంసాటౌన్: మహారాష్ట్ర మాజీ మంత్రి డీబీ పాటిల్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ సోమవారం పరామర్శించారు. ఈమేరకు పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. డీబీ పాటిల్ ఇటీవల అనారోగ్యం బారిన పడగా, చికిత్స పొంది తిరిగి వచ్చారు. దీంతో ఆయన్ను పరామర్శించినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ సదాశివ్ పటేల్, మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, జాడే శ్రీనివాస్ ఉన్నారు.

కుంటాల: కుంటాల గురుస్వామి జక్కని గజేందర్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆయనను జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ సోమవారం పరామర్శించారు. వాసవి కళాశాల ప్రిన్సిపాల్ సాయిలు, బీఆఎస్ మండల కన్వీనర్ పడకండటి దత్తాద్రి, తదితరులు ఉన్నారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి

సోన్: తెలుగు భాషను కాపాడుకోవాలని ఎంఈవో పరమేశ్వర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ తెలుగు భాష దినోత్సవం సందర్భంగా కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు తెలుగుభాషకు సంబంధించిన పలు ప్రదర్శనలను నిర్వహించారు.సీ ఈ సందర్భంగా తెలుగు భాష ప్రాశస్త్యాన్ని తెలిపే చిట్టి నాటికలను ప్రదర్శించారు. విద్యార్థులు చేసిన మట్టి గణపతులు ప్రదర్శన ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం రాజులదేవి రమేశ్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పోషకులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజం కోసం ర్యాలీ

సోన్: పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాక్‌పట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హెచ్‌ఎం వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేపట్టారు.

గ్రోమోర్ కేంద్రం తనిఖీ

తానూరు(ముధోల్): ముధోల్‌లోని మన గ్రోమోర్ కేంద్రాన్ని ఎస్సై బిల్ల పెర్సిస్, ఏవో రచన సోమవారం తనిఖీ నిర్వహించారు. పురుగుల మందులు, ఎరువులను పరిశీలించి పలు వివరాలను మేనేజర్ యోగేశ్‌ను అడిగి తెలుసుకున్నారు.

దుకాణాల్లో తనిఖీలు

కుంటాల: మండల కేంద్రంలోని కిరాణా, పాన్ షాపులు, బేకరీల్లో సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. గంజాయి, మత్తు పదార్థాలను విక్రయిస్తే కేసులు తప్పవని ఎస్సై అశోక్ హెచ్చరించారు. ఎస్సై దేవన్న, సిబ్బంది ఉన్నారు.

రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: బిందు, తుంపర సేద్యం పరికరాలపై ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ద్వారా అందించే రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ డివిజన్ ఉద్యాన అధికారి స్పందన కోరారు. బావాపూర్(ఆర్)లో రైతులు బిందు సేద్యంతో సాగుచేస్తున్న పత్తి, పసుపు పంటలను పరిశీలించారు. రైతు పటేల్ మల్లేశ్, తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

లోకేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. బామ్నికే ప్రభుత్వ పాఠశాలను సోమవారం తనిఖీ చేసి మధ్యాహ్న భోజన్నం, పాఠశాల భవనం, కిచెన్ గార్డెన్‌లను పరిశీలించారు. హెచ్‌ఎం బర్ల చిన్నయ్య, గ్రామస్తులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు లాభాలు

భైంసారూరల్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి ఎస్‌కే జావిద్ పాషా అన్నారు. కోతల్‌గాం రైతు వేదికలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడువుల పరిరక్షణకు భాగస్వాములవుదాం

దస్తురాబాద్: అడువుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుదామని ఎఫ్ఆర్వో గీతారాణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో టైగర్ డే పురస్కరించుకొని విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఎంఈవో గంగాధర్, అటవీ అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నోట్‌బుక్‌లు అందజేత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఉపాధ్యాయుడు వెన్నం అంజయ్య తన సొంత ఖర్చు రూ.5 వేలతో కొనుగోలు చేసిన నోట్‌బుక్‌లు సోమవారం 6వ తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. పెన్సిళ్లు, ఎరైసర్స్, షార్పన్‌లు అందించారు. హెచ్‌ఎం నరేందర్‌రావు, ఉపాధ్యాయులు శేఖర్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.